

# రాజయోగం

కుంతల దేశపు రాజధాని నగరం పక్కనే వున్న ఓ సుభిక్షమైన గ్రామం సౌభాగ్యపురం. భట్టుమూర్తి ఆ గ్రామంలో పేరు మోసిన రైతు. ఆయన ఏకైక కుమారుడు శంతనుడు గ్రామానికి కొంచెం దూరంలో వున్న ముని ఆశ్రమంలో చదువుకుంటున్నాడు. అదే ఆశ్రమంలో శంతనుడి సహాధ్యాయిగా ఆ దేశపు రాజవంశీకుడు చంద్రసేనుడు ఉండేవాడు. చంద్రసేనుడి కోసం అప్పుడప్పుడు ఆశ్రమానికి వచ్చే రాజోద్యోగులను, రాజభటులను చూసినప్పుడల్లా శంతనుడికి తాను కూడా రాజునైతే బావుంటుందని అనిపించేది. రాచరికంలోని దర్జా, హోదా, వైభోగాలను అనుభవించ వచ్చని ఆశ పడేవాడు.

కొల్లూరి సోమశంకర్

చదువు పూర్తి చేసుకుని గ్రామానికి తిరిగి వచ్చిన శంతనుడు ఏ పని చేపట్టక ఊరికే ఆలోచనల్లో కాలం గడిపేవాడు. దేశానికి రాజవ్వాలన్న కోరిక రాను రాను అతనిలో బలపడసాగింది. ఇదే కోరికను శంతనుడు తన మిత్రులతో చెప్పుకునేవాడు. "ఫలానా సాహస కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తే, రాజకుమారి నిచ్చి వివాహం చేస్తానని, అర్ధరాజ్యం ఇస్తానని" మహారాజు ఏదైనా ప్రకటన చేస్తాడేమోనని శంతనుడు నిత్యం ఎదురు చూసేవాడు. ఎప్పుడూ ఊహాలోకాల్లో విహరించే శంతనుడికి, ఏదో ఒక ఉద్యోగం చూసుకోమనో లేదా తమ భూముల్లో వ్యవసాయంచేపట్టమనో భట్టుమూర్తి పలుమార్లు చెప్పి చూసాడు. శంతనుడు తండ్రి మాటలను లక్ష్యపెట్టేవాడు కాదు. శంతనుడి సంగతి తెలుసుకున్న గ్రామస్తులు చాటుగా నవ్వుకునే వారు.

రాజ పదవిపై శంతనుడి వ్యామోహం గురించి తెల్సుకున్న ఓ మోసగాడు భట్టుమూర్తి ఇంట్లో లేనప్పుడు జ్యోతిష్కుడి వేషంలో వచ్చి శంతనుడిని కలిసాడు. శంతనుడిని పరీక్షగా చూస్తున్నట్లు నటిస్తూ .... "ఆహా! ఏమి తేజస్సు! ముఖంలో మహారాజ లక్షణాలు ప్రస్ఫుటంగా గోచరిస్తున్నాయి. ఏది, నీ చేతి రేఖలు చూడనీ ..." అంటూ శంతనుడి చేతిని పరిశీలించసాగాడు.

కొన్ని క్షణాల తర్వాత మళ్ళీ మాట్లాడుతూ... "నాయనా! నీకు రాజయోగం ఉన్నది. నీవు ఒక యాగం చేస్తే ఈ దేశానికి రాజవుతావు. నాకు వంద బంగారు నాణాలు ఇస్తే, నీకోసం ఆ యాగాన్ని నేను జరిపిస్తాను. యాగానికి రేపు రాత్రే ముహూర్తం. రాజధాని నగరానికి ఆవల ఉన్న అడవిలోని పెద్ద మర్రిచెట్టు యాగానికి అనువైన స్థలం! నా దగ్గర నిప్పు తప్ప, యాగానికి కావల్సిన అన్ని వస్తువులు ఉన్నాయి. రేపు రాత్రి నువ్వు కాగడాతో నిప్పు తీసుకుని అక్కడికి వస్తే యాగం జరిపిస్తాను..." అన్నాడా జ్యోతిష్కుడు. తన చిరకాల వాంఛ నెరవేరుతున్నందుకు శంతనుడు మురిసిపోతూ అతనికి వంద బంగారు నాణాలు సమర్పించుకున్నాడు. వాటిని పుచ్చుకున్న జ్యోతిష్కుడు మెల్లగా అక్కడ్నించి జారుకున్నాడు.

మర్నాడు చీకటి పడ్డాక, కాగడా పట్టుకుని అడవిలోని మర్రిచెట్టు వద్దకు చేరిన శంతనుడికి జ్యోతిష్కుడు కనపడ లేదు. "ఏదో పని మీద బయటకు వెళ్ళుంటాడు, రావటం ఆలస్యం అయి ఉంటుంది" అని అనుకున్నాడు శంతనుడు.

ఎంతసేపు వేచి చూసినా జ్యోతిష్కుడు రాకపోయేసరికి శంతనుడికి అనుమానం కల్గింది. ఆ జ్యోతిష్కుడిని వెదుకుదామని బయల్దేరబోయాడు. ఇంతలో అటువైపుగా గస్తీకి వచ్చిన రాజభటులకు కాగడాతో తిరుగుతున్న శంతనుడి ప్రవర్తన అనుమానాస్పదంగా తోచింది. వారు అతన్ని బంధించి తీసుకుపోయి ఆ దేశపు మంత్రి

ముందు హాజరు పరిచారు.

''ఎవర్నువ్వు? ఆ ప్రాంతంలో ఆ సమయంలో ఏం చేస్తున్నావు ? ఏ దేశపు గూఢచారివి? నిజం చెప్పు...'' అంటూ మంత్రి గద్దించాడు. దాంతో కంగారు పడ్డ శంతనుడు... తాను కుంతల దేశపు పౌరుడినే నంటూ మొదలు పెట్టి తాను ఆశ్రమంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఇల్లు చేరిన సంగతి, నకిలీ జ్యోతిష్కుడికి వంద బంగారు నాణెలు సమర్పించుకున్న సంగతి .... అంతా వివరంగా చెప్పేసాడు.

శంతనుడి మాటల్లోని వాస్తవాన్ని గ్రహించిన మంత్రి... ''పదవీ వ్యామోహంలో పడి నువ్వు యుక్తా యుక్త విచక్షణ కోల్పోయావు. విద్యావంతుడి వైనప్పటికీ, వివేకం లేకుండా మూర్ఖుడిలా ప్రవర్తించావు. రాచరికపు బాహ్యా లక్షణాలైన వైభోగం, ఆడంబరాలు, దర్పా, హోదాల పట్ల ఆకర్షితుడవయ్యావు. కాని వాటిని వెన్నంటి ఉండే బాధ్యతలను, ప్రమాదాలను గుర్తించలేదు. దేశ రక్షణ జనరంజకమైన పాలన, ఆర్థిక వ్యవహారాలు ... లాంటి క్లిష్టమైన బాధ్యతలెన్నో మహారాజుకుంటాయి. నీ ఇంటి బాధ్యతే వహించని వాడివి, ఇంత పెద్ద దేశపు బాధ్యతనంతా ఎలా వహించగలననుకున్నావు? కష్టపడి పని చేస్తూ, నిజాయితీగా బ్రతికే ప్రతి మనిషి మహారాజే! ఇంత చిన్న విషయాన్ని అర్థం చేసుకోలేని నీ చదువు వృధా....'' అంటూ తీవ్రంగా మందలించి శంతనుడిని వదిలేయమని భటులను ఆదేశించాడు.

మంత్రి మందలింపుతో శంతనుడికి కమ్ముకున్న పదవీ వ్యామోహ పొరలు తొలగిపోయాయి. తన గ్రామం చేరుకుని, తండ్రి చెప్పినట్లు వ్యవసాయం చేపట్టాడు. కష్టించి పని చేయడంతోపాటు, నాణ్యమైన ఎరువులు, మేలు రకపు విత్తనాలు వాడటంతో, శంతనుడి చేల్లో పంటలు బాగా పండాయి. రెండు మూడు సంవత్సరాలు గడిచేసరికి శంతనుడు ఆ గ్రామంలో కెల్లా ధనవంతుడయ్యాడు. సేవాభావం అలవర్చుకుని, పేరు ప్రఖ్యాతులు ఆశించక తన ధనాన్ని సద్వినియోగం చేయసాగాడు. గ్రామంలోని రహదారులలో వీధి దీపాలు ఏర్పాటు చేయించాడు. దేశం నలుమూలల నుంచి రాజధానికి వచ్చే బాటసారుల కోసం రాజధాని వెలుపల ఒక ధర్మ సత్రం కట్టించాడు. ఇవి గాక, ఎన్నో గుప్త దానాలు చేయసాగాడు. తన గ్రామంలో వారికే గాక, చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఎవరికి ఏ అవసరం వచ్చినా ఆదుకోసాగాడు.

తమ మాటల్లో శంతనుడి ప్రసక్తి వచ్చినప్పుడల్లా గ్రామస్తులు .... ''గొప్ప మా రాజు! ఆయన కలకాలం సుఖంగా ఉండాలి'' అంటూ దీవించేవారు. ఈ మాటలు చెవినపడ్డ శంతనుడు, జ్యోతిష్కుడు తనకి చెప్పిన రాజయోగం ఇదేనను కుని తృప్తిగా నవ్వుకున్నాడు.



# వస్తువు వయస్సు చెప్పవచ్చు

మనిషి మేధస్సు రానురానూ విజ్ఞాన అవధుల్ని చీల్చుకుంటూ నూతనావిష్కరణలకు దారితీస్తున్నది. పురాతన వస్తువుల వయస్సును కనుక్కోవడమే విశేషమైతే, ఆ వస్తువును బట్టి అప్పటి సంఘటనలు, వారి నాగరికతలను అంచనా వేయడం మరింత అద్భుతం. పురాతన వస్తువుల కాలాలను వివిధ పద్ధతుల్లో కనుక్కొంటున్నప్పటికీ, రేడియో కార్బన్ పద్ధతి విశేష ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఈ పద్ధతిని 1947లో అమెరికా శాస్త్రవేత్త డబ్ల్యు.ఎఫ్.లిబ్బీ కనిపెట్టి నోబెల్ బహుమతిని పొందాడు. జీవం, కర్బన రసాయన సమ్మేళనాలతో ఏర్పడిందున జీవరాశులన్నింటిలో రేడియోధార్మిక కార్బన్ (సి-14), మామూలు కార్బన్ (సి-12) స్థిర నిష్పత్తిలో వుంటాయి. ఈ విధానంలో 50 వేల సంవత్సరాల తేడాతో కనుక్కోవచ్చు.

ప్రకృతి నుంచి మొక్కలు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహిస్తాయి. మామూలు కార్బన్‌డయాక్సైడ్‌లో కొన్ని సి-12, మరి కొన్ని సి-14 పరమాణువులు ఉంటాయి. ఈ రూపంలో సి-14 పరమాణువులు చెట్లలోకి చేరి వాటిద్వారా చివరకు జంతువుల్లోకి ప్రవేశిస్తుంది. జీవి మరణానంతరం టిష్యూల్లో ఉండే కార్బన్-14 క్రమేణా తగ్గిపోతుంది.

కార్బన్-14 మూలకం అర్ధజీవిత కాలం 5568 సంవత్సరాలుంటుంది. అంటే ప్రారంభంలో ఉన్న పరమాణువులు సగానికి విఘటనం చెందాలంటే 5568 సంవత్సరాలు పడుతుంది. పురాతనమైన చెక్కను, గుడ్డను కాల్చితే వచ్చే కార్బన్ డయాక్సైడ్ వాయువుతో వస్తువు వయస్సును బట్టి కార్బన్-14 పరమాణువులుంటాయి. వస్తువు పురాతనమయ్యే కొద్దీ కార్బన్-14 పరమాణువుల సంఖ్య తగ్గుతుంది. కార్బన్-14 పరమాణువులు వెలువరించే రేడియోధార్మికతను గైగర్‌ముల్లర్ కౌంటర్‌తో కొలిచి, ఆ వస్తువు వయస్సును నిర్ధారించవచ్చును. ఇప్పటికీ శాస్త్ర పరిశోధనా సంస్థలు ఈ పద్ధతినే అవలంభిస్తున్నాయి.

ఎ.ఎన్.ఎస్. శంకరరావు